# ప్రజా మారుతి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్


ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 22 | గురువారం 17 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2


## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై
# విచారణకు ఆదేశించిన సీఎం

- రేవంత్ రెడ్డి - అసెంబ్లీలో ప్రకటన
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు
- అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ భూములు వివరాలు వెల్లడించారు
- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆరోపణ
- నెల రోజుల్లో విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచన
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతామని సీఎం ప్రకటన



**హైదరాబాద్ :**

మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి 30 రోజుల్లో విచారణ జరపాలని స్పష్టం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 295 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ భూములు వివరాలు వెల్లడించారు. గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందా లేదా తేల్చాలని స్పష్టం చేశారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతానని, శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తానని ఘంటాపథంగా చెప్పారు. మొత్తం రూ.లక్ష కోట్ల భూకుంభకోణం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూకుంభకోణంపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ (ఎస్ఈటీ), మొత్తం భూకుంభకోణంపై నెలరోజుల్లో నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు చెప్పింది ధరణి పార్ట్- 1 మాత్రమేనని, త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతామని వెల్లడిచారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే అన్నీ బయటపెడతామని తెలిపారు. ఈసారి సమావేశాలకు బీఆర్ఎస్ - మిగతా 2 లో



## హైదరాబాద్‌లో భూగర్భ
# జలాల డేంజర్ బెల్స్

- భాగ్యనగరంలో నీటి కష్టాలు తప్పవా?
- గ్రేటర్ హైదరాబాద్‌లో ఆందోళనకరంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- గతేడాదితో పోలిస్తే సగటున 5 మీటర్ల మేర తగ్గిన నీటిమట్టం
- 22 శాతం వర్షపాతం లోటు, పెరిగిన వినియోగమే ప్రధాన కారణం

**హైదరాబాద్ :**

వర్షాకాలం ముగింపు దశకు చేరుకున్నా గ్రేటర్ హైదరాబాద్ వాసులను భూగర్భ జలాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు నీటి వినియోగం భారీగా పెరగడంతో - మిగతా 2 లో

## రేవంత్ రెడ్డి ఆరోపణలకు
# కవిత కౌంటర్



- ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని సవాల్
- తనతో పాటు పలువురి ఆస్తులపైనా సీబీఐ విచారణకు డిమాండ్
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి
- గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ
- ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య

**హైదరాబాద్ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం - మిగతా 2 లో

## కన్నడ లెజెండ్ అనంత్ నాగ్‌కు
# 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం




- సీనియర్ నటుడు అనంత్ నాగ్‌కు 2024 దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు
- భారతీయ సినిమాకు చేసిన సేవలకుగాను ఈ పురస్కారం
- సెప్టెంబర్ 22న గుజరాత్‌లో అవార్డు ప్రదానం
- అనంత్ నాగ్‌ను అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ
- 300కి పైగా చిత్రాలు, 'మాల్గుడి డేస్'తో దేశవ్యాప్త గుర్తింపు



## అంగారకుడిపై
# వింత గుంతలు

- శాస్త్రవేత్తలకే అంతుచిక్కని మిస్టరీ!
- అంగారకుడిపై వింత గుంతలను గుర్తించిన నాసా క్యూరియాసిటీ రోవర్
- ఉల్కాపాతాల వల్ల ఏర్పడే గుంతల కన్నా ఇవి పూర్తిగా భిన్నం
- ఈ గుంతలు చాలా విశాలంగా, లోతు తక్కువగా ఉన్నాయన్న శాస్త్రవేత్తలు
- 14 ఏళ్లుగా మార్స్ పై ఉన్నా, ఈ గ్రహం ఇంకా ఆశ్చర్యపరుస్తూనే ఉందన్న నాసా

**ఢిల్లీ :**

అంగారక గ్రహంపై పరిశోధనలు చేస్తున్న నాసాకు చెందిన క్యూరియాసిటీ రోవర్.. మరో వింతైన ఆవిష్కరణ చేసింది. మార్స్ ఉపరితలంపై కొన్ని అసాధారణమైన గుంతలను గుర్తించింది. సాధారణంగా ఉల్కాపాతాల వల్ల ఏర్పడే గుంతలకు ఇవి పూర్తి భిన్నంగా ఉండటంతో శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ కొత్త ఆవిష్కరణ అంగారకుడి భౌగోళిక చరిత్రపై సరికొత్త - మిగతా 2 లో

# భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక

- అంతర్జాతీయ జలాల్లో సెప్టెంబరు 15న ఘటన
- ఘటనలో పెద్దగా నష్టం జరగలేదన్న భారత వర్గాలు
- పాక్ రాయబారికి భారత్ సమన్లు
- పాక్ నౌక వ్యవహారంపై తీవ్ర నిరసన
- 1991 ఒప్పందం ఉల్లంఘించిందన్న భారత్

**ఢిల్లీ :**

అరేబియా సముద్రంలో భారత నౌకాదళానికి చెందిన ఓ నౌకను పాకిస్థాన్ నేవీకి చెందిన నౌక ఢీకొన్న ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. పాకిస్థాన్ హైకమిషన్ - మిగతా 2 లో



## భారత్, అమెరికా
# ఉమ్మడి సైనిక విన్యాసాలు

- ఔలీ కొండల్లో డ్రోన్లు, ఆధునిక ఆయుధాలతో డ్రిల్స్
- ఉత్తరాఖండ్‌లో 'యుద్ధ అభ్యాస్-2026' 22వ ఎడిషన్ ఉమ్మడి సైనిక విన్యాసాలు
- డ్రిల్స్‌లో పాల్గొన్న 600 మంది సైనిక సిబ్బంది
- రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆధునిక ఆయుధ వ్యవస్థల ప్రదర్శన




**ఢిల్లీ :**

భారత్, అమెరికా సైన్యాల మధ్య వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన 'యుద్ధ అభ్యాస్-2026' 22వ ఎడిషన్ ఉమ్మడి సైనిక విన్యాసాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్తరాఖండ్‌లోని ఔలీలోని ఫారిన్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలతో పాటు సైనిక విన్యాసాలను - మిగతా 2 లో

## ప్రైవేటుకు
# దీటుగా సర్కారీ బడులు



- నెల్లూరులో ఆధునికీకరించిన ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ ప్రభుత్వ స్కూళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్
- డిజిటల్ తరగతులు, రోబోటిక్స్ ల్యాబ్, సింథటిక్ క్రీడా ప్రాంగణం వంటి ప్రత్యేకతలు
- పాఠశాల పనితీరుపై సమీక్ష.. ఉత్తీర్ణత శాతం పెంచాలని అధికారులకు లోకేశ్ ఆదేశం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఇతర టీడీపీ నేతలు

**అమరావతి :**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నెల్లూరు నగరంలో మరో ముందడుగు పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేసిన రెండు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన నెల్లూరు చేరుకోగా, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి - మిగతా 2 లో

# తిరుమలలో కొత్త శకం
# మ్యూజియం నుంచి యాప్ వరకు

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోత్సవాలు
- తిరుమలలో రెండో రోజు పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు
- శ్రీ వేంకటేశ్వర మ్యూజియంను ప్రారంభించనున్న సీఎం
- భక్తుల భద్రత కోసం ఎల్ఐసీతో కలిసి గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం
- పర్యావరణ పరిరక్షణకు 32 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు
- యాత్రికుల వసతి కోసం అందుబాటులోకి 'నందకం' యాప్



**అమరావతి :**

సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో చేపట్టిన పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను నేడు ప్రారంభించనున్నారు. భక్తుల భద్రత, సౌకర్యాలే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను అందుబాటులోకి తెనున్నారు. ఇందులో భాగంగా శ్రీవారి విశేషాలు, తిరుమల విశిష్టతను భక్తులకు తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన శ్రీ వేంకటేశ్వర మ్యూజియంను సీఎం ప్రారంభించనున్నారు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో, 4 అంతస్తులతో నిర్మించిన ఈ మ్యూజియంలో 14 గ్యాలరీలు, 8,000కు పైగా ప్రదర్శనలు ఉన్నాయి. దీంతో పాటు తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఎల్ఐసీతో కలిసి టీటీడీ తీసుకొచ్చిన గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాన్ని కూడా ఆయన ప్రారంభించనున్నారు. దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండే భక్తుల కోసం 'తిరుమల హీలింగ్ అండ్ డివోషన్ ఎక్స్‌పీరియన్స్' కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లో ఇమ్మెర్సివ్ థియేటర్‌తో పాటు లైవ్ మెడిటేషన్ కార్యక్రమాలను ఇందులో ప్రసారం చేయనున్నారు. యాత్రికుల వసతి గదుల కోసం రూపొందించిన 'నందకం యాప్'ను కూడా ముఖ్యమంత్రి లాంచ్ చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ తిరుమల ఘాట్ రోడ్లలో - మిగతా 2 లో



# సంపాదకీయం

## ఇజ్రాయెల్ చరిత్ర... హిందూత్వ మూలాలు!

నేడు 'హిందూత్వ'గా పిలుస్తున్న భావజాలానికి మూలాలు నిజానికి ఆధునిక పరిణామాల్లోనే ఉన్నాయి. బ్రిటిష్ వలస పాలనలోకి మారిన భారత ఉపఖండ చరిత్ర, సంస్కృతులు పాశ్చాత్య వలసవాదం వల్ల తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పాశ్చాత్య సామ్రాజ్యవాద చరిత్రలో ఇజ్రాయెల్ ఏర్పాటు అత్యంత కీలకమైన ఘట్టం. మొదట బ్రిటిష్‌వారు, ఆ తర్వాత అమెరికా అండదండలతోనే ఇజ్రాయెల్ రూపుదిద్దుకుంది. ఇజ్రాయెల్ ఆవిర్భావం గురించి చర్చలు, సంవాదాలు భారత ఉపఖండంలోనూ విస్తృతంగా జరిగాయి. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి జాతీయవాదులు... మొదటి నుంచీ ఒక భూభాగంలో నివసిస్తున్న స్థానిక ప్రజలను నిర్వాసితులను చేస్తూ ప్రత్యేక ఇజ్రాయెల్ ఏర్పడటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1938 నవంబరు 26న గాంధీజీ 'హరిజన్' పత్రికలో 'ఏష్ట్రవ జీవఙం' పేరుతో రాసిన వ్యాసంలో నాజీల హింస పట్ల సానుభూతి చూపుతూనే, సైనిక బలంతో పాలస్తీనాను ఆక్రమించడాన్ని ఖండించారు. నాజీల నియంతృత్వానికి ఎదురొడ్డి జర్మన్ యూదులు అహింసాత్మక సత్యాగ్రహం చేపట్టాలని, తద్వారా నాజీల మనసు మార్చవచ్చని గాంధీ సలహా ఇచ్చారు. అయితే గాంధీ వైఖరిని యూదు మేధావులు తీవ్రంగా విమర్శించారు. యూదులు తమ మనుగడ కోసం 'పాత నిబంధన'లోని భౌగోళిక--రాజకీయ ఆక్రమణ సూత్రాలను ఆశ్రయిస్తుంటే, గాంధీజీ మాత్రం వాటిని కొత్త నిబంధనలోని శాంతియుత క్రైస్తవ/అహింసా మార్గంలో పరిష్కరించుకొమ్మని కోరారు. భవిష్యత్తులో నాజీల వల్ల పీడితులైన యూదులు నాజీలలాగే మారే ప్రమాదాన్ని గుర్తించి ముందుగానే గాంధీ హెచ్చరించారు. మార్టిన్ బూబర్, హయీమ్ గ్రీన్‌బర్గ్, హెన్రీ పోలక్, హెర్మాన్ కల్లెన్‌బాక్ వంటి యూదు మేధావులు గాంధీజీ అహింసా వాదాన్ని విమర్శించారు. నాజీలు వ్యవస్థీకృతంగా ఒక జాతి నిర్మూలనకు పాల్పడుతున్నప్పుడు అహింసాత్మక నిరసనలు, ఆత్మబలిదానాలు పనిచేయవని, హిట్లర్ లాంటి క్రూరుడికి మనస్సాక్షి ఉండదని మార్టిన్ బూబర్ అన్నారు. అలాగే, ఐరోపాలో తమ 'గెట్టో' స్థితిని భారతదేశపు అస్పృశ్యతతో పోలుస్తూ, దళితుల ఆత్మగౌరవ పోరాటాన్ని గుర్తించిన గాంధీ, యూదుల స్వయం నిర్ణయాధికారాన్ని, పురాతన పితృభూమిపై ఉన్న దైవిక--చారిత్రక హక్కును నిరాకరించడాన్ని గ్రీన్‌బర్గ్ ప్రశ్నించారు. గాంధీజీ భారతీయ హిందూ--ముస్లిం ఐక్యత అనే స్వప్రయోజనం కోసమే జియోనిజాన్ని వ్యతిరేకించారని హెన్రీ పోలక్ విశ్లేషించారు. ఈ సందర్భంలో గాంధీ చేసే అహింసాత్మక వ్యాఖ్యానానికి భిన్నంగా, భగవద్గీత లాంటి హిందూ గ్రంథాలు కూడా హింసను సమర్థిస్తాయి అని యూదు మేధావులు కూడా వాదించడం విశేషం. ఇది నేటి హిందూవాదులు చేసే 'ధర్మహింసా తథైవచ' అనే వాదానికి సరిపోలుతుంది. ప్రసిద్ధ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కూడా ఇజ్రాయెల్ ఆవిర్భావానికి మద్దతు ఇవ్వాలని నెహ్రూను కోరారు. రాజ్యాంగంలో అస్పృశ్యతను నిషేధిస్తున్న భారత ప్రభుత్వం, ఐరోపాలో తీవ్ర వివక్షకు గురవుతున్న యూదులకు ఒక ప్రత్యేక దేశం ఏర్పాటు చేయడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే నెహ్రూ కానీ, భారత ప్రభుత్వం కానీ దానికి సుముఖంగా లేవు. మధ్యప్రాచ్యంలో ఇటువంటి దేశ ఏర్పాటు అక్కడ నివసిస్తున్న అరబ్బుల ప్రాథమిక హక్కులకు ముప్పుగా పరిణమిస్తుందని నెహ్రూ స్పష్టం చేశారు. మరొకవైపు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 'జ్యూయిష్ అడ్వకేట్' అనే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇజ్రాయెల్ ఏర్పాటును సమర్థించారు. ఆయన సంకలిత రచనలలో ఐరోపాలోని యూదుల 'గెట్టో' స్థితిగతులు, మోజెస్ నాయకత్వంలో.. పీడితులైన యూదులు 'వాగ్దానం చేసిన భూమి'ని చేరుకోవడం వంటి అంశాలను దళితుల విముక్తి పోరాట పోలికలుగా ప్రస్తావించారు. ఇటీవల ఇజ్రాయెల్ దురాక్రమణను దళిత మేధావులు, క్రైస్తవ దళితులు సమర్థించారు. ఈ వైఖరికి పాశ్చాత్య వలసవాద ప్రభావాలు కారణం. అయితే, వినాయక్ దామోదర్ సావర్కర్ ఇజ్రాయెల్‌ను, యూదు జాతీయవాదాన్ని హిందూత్వతో నేరుగా ముడిపెట్టారు. 1923లో రాసిన గ్రంథంలో సావర్కర్: "యూదులకు పాలస్తీనా, ముస్లింలకు అరేబియా లాగే... హిందువులకు భరతఖండం పితృభూమి, పుణ్యభూమి" అని రాశారు. యూదులు పాలస్తీనాపై చూపిన హక్కును, హిందూవాదులు భరతఖండాన్ని తమ సాంస్కృతిక --రాజకీయ భూమిగా క్లెయిమ్ చేసుకోవడానికి నమూనాగా ఉపయోగించారు. 1948లో ఇజ్రాయెల్ ఏర్పడినప్పుడు సావర్కర్ తక్షణ దౌత్య గుర్తింపు ఇవ్వాలని కోరారు. 1954లో 'కేసరి' పత్రికలో-- శత్రు దేశాల నడుమ ఉన్నప్పటికీ స్వయం రక్షణ, సైనిక శిక్షణలో ఇజ్రాయెల్ చూపిన ధైర్యాన్ని భారతదేశం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరెస్సెస్ అధికారిక వారపత్రిక 'ఆర్గనైజర్' దశాబ్దాలుగా ఇజ్రాయెల్ విదేశాంగ విధానాన్ని సమర్థిస్తూ వ్యాసాలు ప్రచురించింది. 'పితృభూమి', 'పుణ్యభూమి' సూత్రాలతో ఇజ్రాయెల్ దేశభక్తిని పెంపొందించుకున్నట్లే, భారతదేశం కూడా హిందూ రాష్ట్ర భావన ద్వారా సైనిక, సాంస్కృతిక బలాన్ని పునర్నిర్మించుకోవాలని వాదించింది. డా. సుబ్రహ్మణ్యస్వామి వంటి నాయకులు కూడా ఇరు దేశాల మధ్య బలమైన సైనిక, నిఘా కూటమి ఏర్పడాలని పదే పదే ప్రతిపాదించారు. ఒకప్పుడు నాజీయిజాన్ని సమర్థించిన హిందూవాదులు తర్వాత యూదు ఆధిపత్యాన్ని కూడా సమర్థించారు. ఈ విరుద్ధ దృక్పథాలలో ఉన్న సారూప్యత ఒక్కటే-- అది నియంతృత్వం పట్ల ఆరాధనా భావం.

## తిరుమలలో కొత్త శకం.. మ్యూజియం నుంచి యాప్ వరకు

**మొదటిపేజీ తరువాయి -** నడిపేందుకు 32 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి రానున్నాయి. రిలయన్స్ సంస్థ 25 బస్సులు, భారత్ బయోటెక్ 7 బస్సులను టీటీడీకి విరాళంగా అందించాయి. ఈ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించనున్నారు.

## రేపల్లె నేత మోపిదేవి శ్రీనివాసరావును సస్పెండ్ చేసిన జగన్

**మొదటిపేజీ తరువాయి -** శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీని వీడి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. అత్యల్ప కాలంలోనే సస్పెన్షన్ వేటు పడటం బాపట్ల జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గం నుంచి పోటీ చేసి శ్రీనివాసరావు ఓటమిపాలయ్యారు. అయితే, వైసీపీలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక వైసీపీలో సమాంతర గ్రూపు రాజకీయాన్ని నడుపుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. రాబోయే ఎన్నికల్లో రేపల్లె ఎమ్మెల్యే టికెట్ తనకే ఖరారైందంటూ నియోజకవర్గంలో ప్రచారం చేసుకోవడంపై స్థానిక కేడర్ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. మరొకవైపు వర్గపోరు ప్రోత్సహించే నేతలను ఉపేక్షించకూడదనే ఉద్దేశంతోనే జగన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక



**మొదటిపేజీ తరువాయి -** చార్జ్ డి అఫైర్స్ సాద్ అహ్మద్ వారైచ్‌ను బుధవారం విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపింది. పాకిస్థాన్ నౌకాదళ యూనిట్ వ్యవహరించిన తీరు "ఆమోదయోగ్యం కానిది, వృత్తిపరమైన ప్రమాణాలకు విరుద్ధం" అని భారత్ పేర్కొంది. ఈ ఘటన నిన్న (సెప్టెంబరు 15) సాయంత్రం ఉత్తర అరేబియా సముద్రంలో అంతర్జాతీయ జలాల్లో జరిగినట్లు సమాచారం. సాధారణ నిఘా విధుల్లో ఉన్న భారత నౌకకు పాకిస్థాన్ నౌక వేగంగా సమీపానికి వచ్చి, సురక్షితం కాని రీతిలో దిశ మార్చుకుంటూ వచ్చి ఢీకొన్నట్లు భారత వర్గాలు తెలిపాయి. ఘటనలో పెద్దగా నష్టం జరగలేదని పేర్కొన్నాయి. పాకిస్థాన్ నౌక వ్యవహరించిన తీరు 1991లో భారత్, పాకిస్థాన్ మధ్య కుదిరిన సైనిక విన్యాసాలు, కదలికలకు ముందస్తు సమాచారం ఇచ్చే ఒప్పందంలోని ఆర్టికల్ 10కు విరుద్ధంగా ఉందని విదేశాంగ శాఖ తెలిపింది. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా పాకిస్థాన్ సైనిక యూనిట్లు సముద్రంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఇరు దేశాల మధ్య ఉన్న ఒప్పందాలను గౌరవించాలని ఆ దేశ రాయబారికి భారత్ సూచించింది. ఈ సందేశాన్ని పాకిస్థాన్ విదేశాంగ శాఖకు చేరవేయాలని ఆదేశించింది. ఇదే సమయంలో ఇస్లామాబాద్‌లోని భారత చార్జ్ డి అఫైర్స్ కూడా పాకిస్థాన్ విదేశాంగ శాఖకు అధికారికంగా నిరసన తెలియజేయాలని కేంద్రం సూచించింది.

# ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు

**మొదటిపేజీ తరువాయి -** ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా పలువురు జిల్లా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెందిన వీపీఆర్ ఫౌండేషన్ అందించిన రూ. 8.3 కోట్ల ఆర్థిక సహకారంతో సమూలంగా ఆధునికీకరించిన ఆర్.ఎస్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ పాఠశాలలో మొత్తం 43 తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ బోధన కోసం ప్రతి గదిలో ఎల్ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రయోగాత్మక, సాంకేతిక విద్య అందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తూ పాఠశాలలో ఎకరం విస్తీర్ణంలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టును, అవుట్‌డోర్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూలపేట 39వ డివిజన్‌లో రూ. 13.4 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునికీకరించిన దేవిరెడ్డి శారద (డీఎస్ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను కూడా లోకేశ్ ప్రారంభించారు. పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం, ఆర్.ఎస్.ఆర్. పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయుడు, ఇతర అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. కేవలం భవనాలు నిర్మిస్తే సరిపోదని, విద్యా ప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి. శరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భారత్, అమెరికా ఉమ్మడి సైనిక విన్యాసాలు

**మొదటిపేజీ తరువాయి -** నిర్వహించారు. ఆ డ్రిల్‌లో ఇరుదేశాలకు నుంచి సుమారు 600 మంది సైనిక సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తరాఖండ్‌తో పాటు రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆ విన్యాసాలు ఏకకాలంలో జరుగుతున్నాయి. ఔలీలో జరిగిన ప్రారంభోత్సవంలో భారత సైన్యానికి చెందిన 14వ పదాతిదళ విభాగం జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అమరేశ్ గుంజన్, అమెరికా సైన్యానికి చెందిన 11వ ఎయిర్‌బోర్న్ డివిజన్‌లోని 1వ పదాతిదళ బ్రిగేడ్ కంబాట్ టీమ్ కమాండర్ కల్నల్ బెన్ జాక్‌మన్ పాల్గొన్నారు. ఆ విన్యాసాలు ఇరుపక్షాలకు కార్యాచరణ పద్ధతులను అంచనా వేసుకోవడానికి, అభివృద్ధి చేసుకోవడానికి అవకాశాన్ని కల్పిస్తాయని భారత సైనిక అధికారి జనరల్ అమరేశ్ గుంజన్ పేర్కొన్నారు. ఇరుదేశాల సైన్యాల మధ్య బంధాన్ని బలపరుస్తుందని, ఎలాంటి పరిస్థితులలోనైనా కలిసి విజయం సాధించడానికి సిద్ధం చేస్తుందన్నారు. మరోవైపు, అమెరికా సైనిక అధికారి బెన్ జాక్‌మన్ కూడా మట్లాడారు. ఆ డ్రిల్స్ ఇరుదేశ సైనిక దళాల మధ్య మరింత నమ్మకాన్ని పెంపొందించుకోవడానికి సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. పర్వత ప్రాంతాల్లో ఉమ్మడి కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యాన్ని బలోపేతం చేయడమే విన్యాసాల ప్రాథమిక లక్ష్యమని చెప్పారు. అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లోనూ ఉమ్మడి ప్రణాళికలు రచించడం, కార్యాచరణ అమలు, యుద్ధ నైపుణ్యాలు వంటి వాటిపై రెండు దేశాల సైన్యాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయని అన్నారు. యుద్ధ అభ్యాస్ 2026 విన్యాసాల్లో ఈసారి ఆధునిక సాంకేతికతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. నిఘా, శత్రువుల కదలికలను కనిపెట్టే ఆపరేషన్ల కోసం దృష్టి కేంద్రీకరిస్తున్నారు. రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆధునిక ఆయుధ వ్యవస్థల ప్రదర్శన జరగనుంది. ఆ కార్యక్రమంలో అభివృద్ధి చెందుతున్న సైనిక అవసరాలు, మిలిటరీ టెక్నాలజీకి సంబంధించి ఇరుదేశాల సైనిక నిపుణులు తమ అనుభవాలను పంచుకుంటారు. అదేవిధంగా, ఔలిలో పర్వత ప్రాంత యుద్ధ శిక్షణ, అలాగే మహాజన్‌లో ఫీల్డ్ ఫైరింగ్ విన్యాసాల ద్వారా రెండు దేశాల సైన్యాలు తమ సన్నద్ధతను పరీక్షించుకుంటున్నాయి. వీటి ద్వారా ప్రతికూల పరిస్థితులలో తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకుంటాయి. మరోవైపు, భారత్- అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్ వేదికగా స్పందించారు. "రానున్న రెండు వారాల్లో, అమెరికా, భారత సైనికులు కలిసి శిక్షణ పొందుతారు. ఈ క్రమంలో ఇరుదేశాల సైనికులు తమ నైపుణ్యాలను పంచుకుంటూ, సంసిద్ధతను పెంచుకుంటారు. అలాగే, ఇరుదేశాల సైనికుల మధ్య సహకారాన్ని మెరుగుపరుచుకుంటారు" అని పోస్టులో రాసుకొచ్చారు. ఇదిలా ఉండగా, ఔలీ ప్రాంతం సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉంటుంది. అంతేకాదు, సవాలుతో కూడిన భౌగోళిక పరిస్థితులను కలిగి ఉంటుంది. ఈ భూభాగం పర్వతా శిక్షణ కోసం అమెరికా సైనికులకు ఒక మంచి అవకాశాన్ని అందిస్తాయి. అదే సమయంలో భారత సైనికులకు కూడా అమెరికా సైన్యం అవలంభిస్తున్న ఆధునిక పోరాట పద్ధతులు, ఆపరేషన్ పద్ధతులను నేర్చుకునే అవకాశం కలుగుతుంది. కాగా, యుద్ధ అభ్యాస్ 2026 సైనిక డ్రిల్స్ సెప్టెంబర్ 15న ప్రారంభమయ్యాయి. ఈసారి రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఒకేసారి జరుగుతున్నాయి. ఆ విన్యాసాలు రెండు వారాల పాటు జరిగి సెప్టెంబర్ 28న ముగియనున్నాయి. భారత్, అమెరికా మధ్య ఏటా ఈ విన్యాసాలు జరుగుతుంటాయి. ఇరుదేశాల మధ్య రక్షణ బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడంలో డ్రిల్స్ కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, ఈసారి భౌగోళిక వాతావరణంలో నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో లేదా ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఇరు దేశాల సైన్యాలు కలిసికట్టుగా, సమర్థవంతంగా పనిచేసే సామర్థ్యాన్ని పెంచుకునేందుకు విన్యాసాలు దోహదపడనున్నాయి.

## కన్నడ లెజెండ్ అనంత్ నాగ్‌కు 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం



**మొదటిపేజీ తరువాయి -** సీనియర్ నటుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అనంత్ నాగ్‌కు భారతీయ చలనచిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 సంవత్సరానికిగాను.. భారతీయ సినిమాకు ఆయన అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) అధికారికంగా వెల్లడించింది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని కెవాడియాలో జరగనున్న 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో అనంత్ నాగ్ ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా అనంత్ నాగ్‌కు అభినందనలు తెలిపారు. అద్భుతమైన నటన, వైవిధ్యమైన పాత్రలతో, ముఖ్యంగా కన్నడ చిత్రసీమలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ గౌరవానికి ఆయన అన్ని విధాలా అర్హులని ప్రధాని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 4న జన్మించిన అనంత్ నాగ్ (అనంత్ నాగర్‌కట్టె) తన సుదీర్ఘ కెరీర్‌లో 300కు పైగా చిత్రాల్లో నటించారు. వీటిలో 250కి పైగా కన్నడ చిత్రాలే ఉన్నాయి. ఆయన కన్నడతో పాటు హిందీ, తెలుగు, తమిళం, మరాఠీ, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరపైనే కాకుండా, ఆర్.కె. నారాయణ్ కథల ఆధారంగా దూరదర్శన్‌లో ప్రసారమైన 'మాల్గుడి డేస్' సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తన నటనకుగాను ఐదుసార్లు కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు అందుకున్న అనంత్ నాగ్‌ను, గత ఏడాది (2025) భారత ప్రభుత్వం దేశంలోని మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌తో సత్కరించింది. దశాబ్దాలుగా భారతీయ సినిమాకు ఆయన చేస్తున్న సేవలకు ఫాల్కే అవార్డు సరైన గౌరవమని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

## అంగారకుడిపై వింత గుంతలు

**మొదటిపేజీ తరువాయి -** ప్రశ్నలను లేవనెత్తింది. గేల్ క్రేటర్‌లోని మౌంట్ షార్ప్ పర్వతంపై ఉన్న 'వాలే గ్రాండే' అనే విశాలమైన లోయలో ప్రయాణిస్తున్నప్పుడు రోవర్ కెమెరాలకు ఈ వింత నిర్మాణాలు కనిపించాయి. దుమ్ముతో నిండిన నేలపై ఈ గుంతలు స్పష్టంగా, ప్రత్యేకంగా కనిపిస్తున్నాయని నాసా తెలిపింది. ఇవి చాలా చిన్నవిగా, లోతు తక్కువగా ఉన్నాయని, గతంలో చూసిన వాటికి భిన్నంగా ఉన్నాయని ఎంఏహెచ్ఎల్ఐ డిప్యూటీ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ మిషెల్ మినిట్టీ ఒక బ్లాగ్ పోస్టులో వివరించారు. ఈ గుంతల లోపల ఎలాంటి వస్తువులు లేకపోవడం మరో ఆసక్తికరమైన అంశమని ఆమె పేర్కొన్నారు. ఈ గుంతలను దగ్గరి నుంచి ఫోటోలు తీయడానికి రోవర్‌లోని 'మార్స్ హ్యాండ్ లెన్స్ ఇమేజర్' (ఎంఏహెచ్ఎల్ఐ) అనే క్లోజప్ కలర్ కెమెరాను, మాస్ట్‌క్యామ్‌ను ఉపయోగించారు. ఈ చిత్రాల సహాయంతో త్రీడైమెన్షనల్ (3డీ) మోడల్స్‌ను రూపొందించి, వాటి ఆకారాన్ని, లోతును శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ గుంతల వ్యాసం సుమారు 1 సెంటీమీటర్ వరకు ఉంటుందని నాసా అంచనా వేసింది. "క్యూరియాసిటీ రోవర్ మార్స్ ఉపరితలంపై అడుగుపెట్టి 14 ఏళ్లు గడిచినా, ఈ గ్రహం మమ్మల్ని ఇంకా ఆశ్చర్యపరుస్తూనే ఉంది" అని డాక్టర్ మినిట్టీ అన్నారు. మౌంట్ షార్ప్ భౌగోళిక చరిత్రను అర్థం చేసుకునే క్రమంలో ఈ కొత్త ఆవిష్కరణ ఒక స్వాగతించదగిన పజిల్‌గా మారిందని ఆమె అభిప్రాయపడ్డారు. కేవలం ఈ గుంతలే కాకుండా వాటి చుట్టూ ఉన్న రాతిపొరలు కూడా చాలా సంక్లిష్టంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. రాళ్ల ఆకృతి, నిర్మాణంలో స్వల్ప దూరంలోనే అనేక మార్పులు కనిపించాయి. ఇది ఒకప్పుడు అక్కడి వాతావరణ పరిస్థితులలో వచ్చిన మార్పులకు నిదర్శనం కావచ్చని వారు భావిస్తున్నారు. ఆ రాతిపొరల రసాయన కూర్పును విశ్లేషించడానికి క్యూరియాసిటీలోని కెమ్‌క్యామ్, ఎంఏహెచ్ఎల్ఐ, ఏపీఎక్స్ఎస్ వంటి పరికరాలను ఉపయోగిస్తున్నారు. మొత్తంగా ఈ వింత గుంతలు ఎలా ఏర్పడ్డాయో తెలుసుకునేందుకు పరిశోధనలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్

**మొదటిపేజీ తరువాయి -** భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ - గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

## హైదరాబాద్‌లో భూగర్భ జలాల డేంజర్ బెల్స్



**మొదటిపేజీ తరువాయి -** భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టు నాటికి సగటు భూగర్భ జలమట్టం ఏకంగా 4.84 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భూగర్భ జలవనరుల శాఖ విశ్లేషణ ప్రకారం.. ఆగస్టు చివరి నాటికి గ్రేటర్ పరిధిలో సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 360 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 22 శాతం తక్కువ. వర్షపాతం లోటు కారణంగా నగరవాసులు తాగునీరు, ఇతర అవసరాల కోసం బోర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ రెట్టింపు ప్రభావంతో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటిపోయాయి. గతేడాది ఆగస్టులో సగటున 6.36 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భ జలాలు, ప్రస్తుతం 11.20 మీటర్ల లోతుకు పడిపోయాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాచుపల్లి, శేరిలింగంపల్లి, దుండిగల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వంటి కీలక మండలాల్లో భూగర్భ జలాలు 15 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. అత్యంత దారుణంగా కుత్బుల్లాపూర్ మండలంలో నీటిమట్టాలు 39 మీటర్లకు పైగా లోతుకు పడిపోవడం గమనార్హం. గ్రేటర్ పరిధిలోని మొత్తం 73 శాతం ప్రాంతంలో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే దిగువన ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెలలో భారీ వర్షాలు కురిసి, భూగర్భ జలాలు తిరిగి పుంజుకుంటేనే కొంత ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. లేనిపక్షంలో రానున్న వేసవిలో భాగ్యనగరవాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తున్నారు. సెప్టెంబర్ వర్షపాతమే హైదరాబాద్ భవిష్యత్ నీటి భద్రతను నిర్ధారిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన సీఎం

**మొదటిపేజీ తరువాయి -**

సభ్యులు వచ్చేలా స్పీకర్ చూడాలని కోరారు. తన కళ్లల్లోకి చూసి మాట్లాడే ధైర్యం వాళ్లకు ఉండదని, టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సెషన్‌లో బయటపెడతామని స్పష్టం చేశారు. హరీశ్‌రావుకు రంగనాయకసాగర్ పరిధిలో భూమి ఉందని, రంగనాయకసాగర్ ప్రాంతంలో హరీశ్‌రావు భూమి కొన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. రిజర్వాయర్ కోసం ఇరిగేషన్ శాఖ భూసేకరణ చేసిందని, హరీశ్‌రావు కొన్న భూమిని భూసేకరణ జాబితాలోంచి తర్వాత తొలగించారని, రామంచ సర్వే నం. 4.20 ఎకరాలకు గాను ఒక ఎకరం తీసుకున్నారని పేర్కొన్నారు. భూసేకరణ రైతలకు ఎకరాకు రూ. 6.20 లక్షల చొప్పున చెల్లించిందని, హరీశ్‌రావు మాత్రం రైతుల నుంచి రూ. 2.50 లక్షల చొప్పున కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయని, రంగనాయకసాగర్ ఫామ్‌హౌస్‌కు రూ. 5.33 కోట్లతో బీటీ రోడ్డు వేయించుకున్నారని, సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో టెండర్లు కూడా లేకుండా రోడ్డు వేయించుకున్నారని వెల్లడించారు. ధరణిని అడ్డుపెట్టుకుని హరీశ్‌రావు మామ, సోదరుడు 94 ఎకరాల భూమిని కొల్లగొట్టారని, హరీశ్‌రావు మామ కూడా 93.33 ఎకరాల భూమిని గౌరవ్ పురానా పేరు ఉంటే ఎం. హనుమంతరావు పేరు మీదకు మార్చారని సీఎం ఆరోపించారు. 2022లో రాజ్ హైటెక్ ఫామ్ లిమిటెడ్ మీదకు మార్చుకున్నారని, రాజ్ హైటెక్ ఫామ్ లిమిటెడ్‌లో హనుమంతరావు, హరీశ్‌రావు తమ్ముడు మహేశ్‌రావు భాగస్వాములని తెలిపారు. సత్యం రామలింగరాజు ఆస్తులను కేటీఆర్ తీసుకున్నారన్న సీఎం హైకోర్టులో వివాదంలో ఉన్న సత్యం రామలింగరాజు భూమి కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని తెలిపారు. జన్వాడలో సర్వే నం. 311లో ఇన్‌కంటాక్స్ సీజ్ చేసిన భూమి కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని అన్నారు. ఐటీ అటాచ్ చేసిన భూమి శతభిష కంపెనీ నుంచి బదిలీ అయ్యిందని, 2015లోకి ఆచంట మల్లన్న చేతుల మీదుగా కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని, శతభిష ఆగ్రో ప్రైవేటు లిమిటెడ్ అనేది సత్యం రామలింగరాజుకు సంబంధించిందని, 2019లో ధరణి కాంట్రాక్టు కట్టబెడితే జన్వాడ భూములు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. జగదీశ్‌రెడ్డి 50 ఎకరాల ఫామ్‌హౌస్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చిందని నిలదీశారు. పైలట్ రోహిత్‌రెడ్డి అజీజ్‌నగర్‌లో అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి , సుధీర్‌రెడ్డి 650 ఎకరాల ప్రభుత్వ భూమి కొనుగోలు చేశారని అన్నారు. కిషన్‌రెడ్డి సొంతూరు తిమ్మాపూర్‌లో 77 ఎకరాల భూదాన్ భూమి ప్రైవేటుపరమైందని, దామోదర్‌రావుకు గోల్డ్‌స్టోన్ ప్రసాద్ బెంజి కారు ఇచ్చారని తెలిపారు. దామోదర్‌రావుకు బెంజికారు ఎందుకు ఇచ్చారో కేసీఆర్ విచారణకు అడుగుతారా? ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్సీ మల్కం కొమురయ్య 10 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేశారని ఆరోపించారు.

# బీరుసాని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకీ యూనిఫామ్ షూస్ పంపిణి





**వెల్గటూర్ సెప్టెంబర్ 16 ( ప్రజా మంటలు ) :** వెల్గటూర్ మండలం బీరుసాని గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రోజున విద్యార్థులకీ స్కూల్ యూనిఫామ్, మరియు షూస్ పంపిణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కారుకూరి శరణ్య - చంద్రశేఖర్, ఉపసర్పంచ్ రడపాక మల్లేష్, వార్డ్ సభ్యులు ద్యావనపల్లి సంధ్యరాణి - మధు,బర్రె లత - వెంకటేష్,జక్కుల లలిత - అంజయ్య,కారుకూరి సత్తయ్య,పంచాయతీ కార్యదర్శి బాలే రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి,ఉపాధ్యాయులు రజిత, నిరోష,రవళి, సంధ్య రాణి ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# స్తంభంపల్లి గ్రామం లో సర్ దరఖాస్తులు స్వీకరణ



**వెల్గటూర్ సెప్టెంబర్ 16 ( ప్రజా మంటలు ) :** వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామం లో గ్రామ పంచాయతీ లో బుధవారం రోజున కి సంబందించిన తప్పులు దొర్లిన ఓటర్ల నుండి 75 బూత్ లో 200 నోటీసులకి గాను 125 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. అలాగే 76 బూత్ లోని 200 దరఖాస్తులు గాను 100 దరఖాస్తులు రావడం జరిగింది. ఈ కార్యక్రమం లోదదొంత రాజేశ్వరి, రాజు కుమార్, దీూా లు, పంచాయతీ సెక్రటరీ కుమార్ స్వామి, సర్పంచ్ భూపల్లి రాజయ్య, ఉపసర్పంచ్ యాగండ్ల గంగయ్య, యూత్ నాయకులు హరి ప్రశాంత్, కారోబార్ నరేష్,స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, గ్రామ పంచాయతి సిబ్బంది ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

## సూపర్వైజర్ శంకరమ్మ





**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 16( ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్వాడి సూపర్వైజర్ శంకరమ్మ అన్నారు.ఇబ్రహీంపట్నం మండలం లోని డబ్బా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే అంగన్వాడీ కేంద్రంలో బుధవారం రోజున పోషణపక్షం మాసోత్సవాల భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి సూపర్వైజర్ శంకరమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ద్వారా అవగాహన కల్పించారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు సమతుల ఆహారం తీసుకోవాలని, పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలపై తల్లిదండ్రులు పిల్లలకు రోజు బాలామృతం, గుడ్లు, అలాగే గర్భిణీ స్త్రీలు రోజు పాలు, గుడ్లు తినాలని అన్నారు, పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తూ తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వై. సంజీవరాణి, సుందరగిరి గంగామణి, ఆశ వర్కర్లు వడ్డేపల్లి రజిత, బక్కూరి జ్యోతి, ఐకెపి సీఏలు కంట మేరీ, రాడే గౌతమి, అంగన్వాడి ఆయమ్మలో పారుపల్లి విమల, గుండు శ్యామల, పిల్లల తల్లులు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు

# పొన్నం సత్తయ్య గౌడ్‌కు ఆడువాల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభుషణమ్ ఘన నివాళి





**కరీంనగర్, సెప్టెంబర్ 16 (ప్రజా మంటలు):** రాష్ట్ర రోడ్లు, రవాణా సంస్థ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ఘనంగా నివాళులర్పించారు.కరీంనగర్‌లోని పొన్నం సత్తయ్య గౌడ్ తోటలో ఆయన విగ్రహానికి ఆడువాల జ్యోతి లక్ష్మణ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జగిత్యాల జిల్లా ఆర్టీవో నంబర్ కమటాల శ్రీనివాస్, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ రఘును పరామర్శించిన టీఆర్ఎస్ చీఫ్ కవిత



**మెట్‌పల్లి, సెప్టెంబర్ 16 (ప్రజా మంటలు):** కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జి డాక్టర్ రఘు తల్లి పుష్పలత ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం మెట్‌పల్లిలోని రఘు నివాసానికి వెళ్లి ఆయనతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా పుష్పలత చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# సఖి హెల్ప్‌లైన్ కరపత్రం ఆవిష్కరణ



**జగిత్యాల, సెప్టెంబర్ 16 (ప్రజా మంటలు):** మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన సఖి మహిళా హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 181 కరపత్రాన్ని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహిళలు వేధింపులు, గృహహింస లేదా ఇతర సమస్యలను ఎదుర్కొన్నప్పుడు 181కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. మహిళల భద్రత, సంక్షేమం కోసం సఖి హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం



**జగిత్యాల, సెప్టెంబర్ 16 (ప్రజా మంటలు):** వాణి నగర్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషణ అవగాహన ర్యాలీ, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన సఖి హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 181 కరపత్రాన్ని ఆవిష్కరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వాణి శ్రీనివాస్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ జయప్రద కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# అఫిడవిట్‌లో పేర్కొన్నదానికంటే అదనంగా భూమి ఉంటే ప్రభుత్వానికి సరెండర్ చేస్తా

## కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రజా మంటలు):** ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తులకన్నా గజం భూమి ఎక్కువగా ఉన్నా ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్లు అబద్ధాలు చెప్పారని ఆమె ఆరోపించారు. ముఖ్యమంత్రిపైనే తమకు నమ్మకం లేదని, అసెంబ్లీలో సీఎం ప్రస్తావించిన భూముల వివరాలపై నిజాలు నిగ్గు తేలాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.గుంపు మేస్త్రీ, గుంటనక్క ముమ్మాటికీ కలిసే ఉన్నారని మరోసారి స్పష్టం చేస్తున్నానని కవిత పేర్కొన్నారు. సీఎం అసెంబ్లీలో ప్రస్తావించిన వ్యక్తులతో పాటు నవీన్‌రావు, కొండల్‌రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, ప్రతిమ శ్రీనివాస్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి తదితరుల భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని ఆమె డిమాండ్ చేశారు.ప్రభుత్వ నిబంధనలకు మించి తన వద్ద ఒక్క గజం భూమి ఉన్నా, ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న దానికంటే అదనంగా భూమి ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని కల్వకుంట్ల కవిత మరోసారి స్పష్టం చేశారు.

# కరీంనగర్‌లో రూ.8 కోట్లతో కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించిన మంత్రి పొన్నమ్

## 49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం




**కరీంనగర్ సెప్టెంబర్ 16 (ప్రజా మంటలు):** పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్యేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు.కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా భాగస్వామ్యంతో రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆకలితో తరగతులకు రాకుండా పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమన్నారు. కరీంనగర్‌లోని 17 మండలాల్లో 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 49,025 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.రోజుకు 50 వేల మందికి అల్పాహారం అందించే సామర్థ్యంతో కిచెన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తదితర ఆహార పదార్థాలను అధునాతన యంత్రాలతో తయారు చేసి పరిశుభ్రంగా అందిస్తామని తెలిపారు. విద్యార్థుల హాజరు, ఏకాగ్రత, విద్యా పనితీరు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు.కోడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం మంచి ఫలితాలు ఇచ్చిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17.72 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు చెప్పారు.అనంతరం మంత్రి విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. కిచెన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి ఆహార తయారీ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై వివరాలు తెలుసుకున్నారు.

# భక్తిశ్రద్ధలతో గణనాథుడి పూజలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 16 (ప్రజా మంటలు)::** సికింద్రాబాద్ బౌద్ధనగర్ డివిజన్ మారుతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నాటి ఆనంద్ కుమార్ నిర్వహించిన గణేష్ పూజల్లో బీఆర్ఎస్ నాయకుడు మంద జగన్ పాల్గొన్నారు. గణనాథుని కృపతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతకింది మల్లేష్, ఒగ్గు శ్రీధర్, తిరుమల రవి, శ్రీకాంత్, సతీష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రవి ఆకస్మిక తనిఖీ



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 16 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అదనపు కలెక్టర్ రవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, అక్కడ నిర్వహిస్తున్న ఫైళ్లను తనిఖీ చేశారు.పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, కార్యాలయ నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై అదనపు కలెక్టర్ రవి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, దస్త్రాలను పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించినట్లు సమాచారం విధి నిర్వహణలో తహసీల్దార్ ప్రసాద్ రావు డిప్యూటీ తహశీల్దార్ రమేష్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు

# సారంగాపూర్‌లో ఘనంగా పోషణ అభియాన్ మహోత్సవం

## గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**జగిత్యాల/సారంగాపూర్, సెప్టెంబర్ 16 (ప్రజా మంటలు):** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ధర్మపురి ప్రాజెక్టు ఆధ్వర్యంలో సారంగాపూర్ మండల స్థాయి పోషణ అభియాన్ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సారంగాపూర్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి సీడీపీవో వాణిశ్రీ అధ్యక్షత వహించగా, సూపర్‌వైజర్లు శైలజ, లత ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ వహీయొద్దీన్, ఎంపీడీవో నీరజతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు హాజరయ్యారు. పోషణ మాసం, పోషణ అభియాన్‌లో భాగంగా పౌష్టిక విలువలు కలిగిన వివిధ రకాల వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లల ఎదుగుదలకు బాలామృతం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఆరు నెలలు నిండిన ప్రతి చిన్నారికి ప్రతిరోజూ బాలామృతాన్ని తప్పనిసరిగా అందించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలకు శ్రీమంతాల కార్యక్రమం చేపట్టారు. జాతీయ పోషణ అభియాన్‌లో భాగంగా అధికారులు, సిబ్బంది, మహిళలు, తల్లులు, గ్రామస్తులతో పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో ఏసీడీపీవో మౌనిక, సూపర్‌వైజర్లు శైలజ, లత, సారంగాపూర్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, సఖి సిబ్బంది, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళలు, తల్లులు, పిల్లలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేళ వర్షాలతో రైతుల్లో ఆనందం

## "వినాయకుడే మమ్మల్ని కాపాడాడు" అంటూ రైతుల సంబరాలు



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 16 (ప్రజా మంటలు):** వినాయక చవితి పర్వదినం సందర్భంగా కురిసిన వర్షాలతో హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్ గ్రామంలోని రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. సోమవారం, మంగళవారం కురిసిన వర్షాలు ఎండిపోతున్న పంటలకు ఎంతో ఊరటనిచ్చాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.వినాయక చవితి రోజున వర్షాలు కురవడాన్ని గణనాథుడి ఆశీస్సులుగా భావించిన రైతులు వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు ఎండిపోతున్న సమయంలో వర్షాలు కురవడంతో తమకు ప్రాణం పోసినట్లయిందని ఆనందం వ్యక్తం చేశారు."వినాయకుడే మమ్మల్ని ,రైతులను కాపాడాడు. పంటలు ఎండిపోతున్న సమయంలో వర్షం కురవడంతో ఎంతో ఊరట లభించింది. ఈ వర్షాలతో పంటలు నిలబడతాయనే నమ్మకం వచ్చింది" అని రైతులు తెలిపారు."భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజిస్తున్నాం. మా మొక్కులు విని స్వామి వర్షాలు కురిపించాడని నమ్ముతున్నాం. ఇంకా మంచి వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పొలాల్లో మంచి పంటలు పండాలని కోరుకుంటున్నాం" అని పలువురు రైతులు అన్నారు.ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండితే రైతుల కుటుంబాల్లో ఆనందం నెలకొంటుందని అన్నారు. నవరాత్రి ఉత్సవాల సమయంలో మరిన్ని వర్షాలు కురిసి రైతులకు మంచి దిగుబడులు రావాలని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని గణనాథుడిని వేడుకున్నారు.వినాయక చవితి రోజున వర్షాలు కురవడంతో గ్రామంలో పండుగ వాతావరణం మరింత ఉత్సాహంగా మారింది. గణనాథుడి కరుణతో ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కష్టాలు తొలగి వారి కుటుంబాల్లో సంతోషం వెల్లివిరియాలని వల్లభాపూర్ రైతులు ఆకాంక్షిస్తున్నారు.

# ఓజోన్ పరిరక్షణే.. భవిష్యత్ తరాలకు రక్షణ

## తహసీల్దార్ నేలపట్ల నరేష్



**మునుగోడు, సెప్టెంబర్ 16 (ప్రజా మంటలు):** ఓజోన్ పొరను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని మునుగోడు తహసీల్దార్ నేలపట్ల నరేష్ అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ ఎన్విరాన్‌మెంట్ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో మునుగోడులోని సత్య ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ సూర్యుడి హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి జీవరాశులను ఓజోన్ పొర రక్షిస్తుందని తెలిపారు. కాలుష్యాన్ని నియంత్రించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలు నాటడం, పర్యావరణహిత జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు."ఓజోన్ పొరను కాపాడుకుందాం.. భూమిని రక్షిద్దాం.. భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందిద్దాం" అని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమ నాయకులు, ఇండియన్ ఎన్విరాన్‌మెంట్ సోషల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జీడిమెట్ల రవీందర్, ఎంఈఓ టి. మల్లేశం, ఫారెస్ట్ రేంజ్ అధికారి కె. సుచరిత, ఫోరం ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట నరసింహాచారి, కోణం రమేష్, బొల్లం శ్రీశైలం, జె. రమేష్, జి. వెంకటాచారి, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో మహిళా సమైక్య ఆఫీసులో ఖాళీ బూడిదైన చీరలు



**ఎల్కతుర్తి ఆగస్టు 16 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రోడ్డబోయిన స్వర్ణలత. దామెర గ్రామం, ఈ రోజు జూం కి వచ్చి ఎల్కతుర్తి గ్రామం లోని మండల సమాఖ్య భవనంలోని స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన 829 ఇందిరమ్మ చీరలు, స్టీల్ ప్లేట్స్, గ్లాసెస్ మరియు 25 టార్పాలిన్ పట్టాలు బుధవారం రాత్రి అందజా 1200 గంటల సమయంలో జరిగినటువంటి అగ్నిప్రమాదంలో కాలిపోయాయని మరియు కాలిపోయిన వాటి విలువ సుమారుగా నాలుగు లక్షల 40 వేల రూపాయలు ఉంటుందని ఫిర్యాదు చేయగా, ఇట్టి సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం అయినది.

# బుగ్గారం మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటన

## పలు నిర్మాణ భవనాలు, జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**గొల్లపల్లి సెప్టెంబర్ 16ప్రజా మంటలు :** బుగ్గారం మండలంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం పర్యటించి పలు అభివృద్ధి పనులు, నిర్మాణంలో ఉన్న భవనాలు, జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆయా పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణ నాణ్యతలను సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చిన్నాపూర్ గ్రామంలోని వీవో భవనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించిగా ఈ భవన నిర్మాణానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (మ్నేగ్స్) ద్వారా రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు అధికారులు వివరించారు. అనంతరం చిన్నాపూర్ గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. పంచాయతీ భవన నిర్మాణానికి మ్నేగ్స్ ద్వారా రూ.20 లక్షల నిధులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.అనంతరం బుగ్గారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి) భవనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ భవన నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.1.43 కోట్ల నిధులు కేటాయించినట్లు అధికారులు వివరించారు. నిర్మాణ పనుల నాణ్యతతో వేగవంతం గా పూర్తి చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.అలాగే నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, మంజూరైన నిధులను నిబంధనల మేరకు సక్రమంగా వినియోగిస్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.జిల్లా పరిషత్ పాఠశాల ఆకస్మిక తనిఖీ బుగ్గారం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పదవ తరగతి గదిలో విద్యార్థులతో పాటు 20 నిమిషాలు ఉపాధ్యాయుడు బోదిస్తున్న సైన్స్ పాఠ్యంశాన్ని నిశితంగా పరిశీలించారు. తరగతి గదిలో ప్రతి విద్యార్థి శ్రద్ధతో విద్య నేర్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలాని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధనా సౌకర్యాలు, తరగతి గదులు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు.పాఠశాలలోని గ్రంథాలయ భవన నిర్మాణానికి మోల్డ్ నిధుల ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు అధికారులు వివరించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, విద్యా సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, డిఈవో కె. రాము,ఈపర్ ఎన్. లక్ష్మణరావు, డి ఈ (పి ఆర్) సబ్ డివిజన్ ధర్మపురి కె. గోపాల్, డి ఈ ఓ, బుగ్గారం ఎంపీడీవో ఎం. సుమంత్, బుగ్గారం ఎం ఆర్ ఓ వినోద్, ఎం పి ఓ , స్థానిక ప్రజా ప్రతినిధులు, ఏ ఈ (పి ఆర్), ఏ పి ఎం, ఏ పి ఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక లోకంలో విహరిస్తున్న అనుభూతి

**తిరుమలలో ఎస్వీ మ్యూజియం విశేషాలేంటంటే**

**తిరుమలలో ఎస్వీ మ్యూజియాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు**

**జీ3 అంతస్తులు, 19 గ్యాలరీలు, 14 వేలకు పైగా కళాఖండాలతో శ్రీవేంకటేశ్వర మ్యూజియాన్ని టీటీడీ నవీకరించింది**

**చరిత్ర, ఆధ్యాత్మికత, సాంకేతికతల మేళవింపుగా నిలుస్తోంది.**



వేల ఏళ్ల తిరుమల చరిత్ర, శ్రీనివాసుడి వైభవం, రాజుల సేవనం, కవి గాయకుల సంకీర్తనల మాధుర్యం, హైందవ ధర్మ ఔన్నత్యం, ఆలయ నిర్మాణ కౌశల్యం, భారతీయ శిల్పకళా సౌందర్యం, ఆధునిక సాంకేతికత ఇవన్నీ ఒకేచోట కళ్లకు కడితే.! ఆ అనుభూతిని ఆస్వాదించండని తిరుమలలోని 'శ్రీ వేంకటేశ్వర మ్యూజియం' ఆహ్వానిస్తోంది. ఒకప్పటి ఈ పురాతన వస్తు ప్రదర్శనశాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా, 3డీ, 7డీ సాంకేతికతను జోడిస్తూ టీటీడీ ఈ మ్యూజియాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దింది. టీసీఎస్ నుంచి రూ.125 కోట్లు, మ్యాప్ సంస్థ రూ.20 కోట్లు కలిపి మొత్తం రూ.145 కోట్ల విరాళం ఇవ్వగా, దీనికి సకల హంగులు అద్దింది. ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఈ మ్యూజియాన్ని ప్రారంభించారు. ఈ తరుణంలో అందులోని విశేషాల గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.చరిత్రకు సజీవ సాక్ష్యం: 1980ల్లో శ్రీవారి ప్రధాన ఆలయానికి ఎదురుగా ఉన్న 'వేయి కాళ్ల మండపంలో 'హాల్ ఆఫ్ యాంటిక్స్' పేరుతో ఒక మ్యూజియం ఉండేది. దాన్ని 1990ల్లో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న భవంతిలోకి తరలించారు. పల్లవులు, చోళులు, పాండ్యులు, విజయనగర రాజులు స్వామివారికి ఎన్నో కానుకలు సమర్పించేవారు. వాటన్నింటిని ఇక్కడ భద్రపరిచారు.ఆధ్యాత్మిక లోకంలో విహరిస్తున్న అనుభూతి: 1.25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో, మూడు అంతస్తులతో, 19 గ్యాలరీలు, 14,000కు పైగా కళాఖండాలతో కూడిన ఈ మ్యూజియాన్ని టీటీడీ ఆధునీకరించింది. నిత్యం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులు ఈ మ్యూజియాన్ని సందర్శించవచ్చు. సాధారణ ప్రవేశ రుసుం రూ.50 కాగా, 'బ్రహ్మాండ గ్యాలరీ'తో కలిపి ప్రవేశ రుసుము రూ.200గా నిర్ణయించారు. దీనిలోకి అడుగుపెట్టగానే, ఏదో ఆధ్యాత్మిక లోకంలో విహరిస్తున్న అనుభూతి కలుగుతుంది.ఇక్కడి హోలోగ్రాఫిక్ డిస్‌ప్లేలు, స్పేషియల్ సౌండ్, 360 డిగ్రీల ఇంటరాక్టివ్ డిస్‌ప్లేల వంటి సాంకేతికతల సహాయంతో, ప్రతి కళాఖండం తన కథను తానే చెబుతున్నట్లుగా డిజిటలైజ్ చేశారు. మోషన్ సెన్సార్ లైటింగ్ వ్యవస్థ ద్వారా, సందర్శకులు ఉన్న చోట మాత్రమే లైట్లు వెలిగేలా ఏర్పాటు చేశారు. హైస్పీడ్ ఎలివేటర్లు, ఏసీ గ్యాలరీలు, తాగునీరు, విశ్రాంతి గదులు నిర్మించారు. మ్యూజియంలోకి మొబైల్ ఫోన్లు, కెమెరాలు, బ్యాగులు, పాదరక్షలను అనుమతించరు. వాటిని భద్రపరుచుకునేందుకు లాకర్ సౌకర్యం ఉంది.గ్రౌండ్ ఫ్లోర్‌లోని 'ఎస్వీ గ్యాలరీ'లో శ్రీవారి మూర్తితో పాటు ఆభరణాలైన శిఖామణి, వజ్రకిరీటం, మకరకుండలాలు, సహస్రనామ మాల, సూర్యకటారి, దశావతార వడ్డాణాలు, పుష్ప, వస్త్రాలంకరణల దృశ్యాలను 3డీ ఇమేజ్ ప్రొజెక్షన్‌తో ప్రదర్శిస్తారు.రాతిశిల్ప గ్యాలరీ: అలాగే 'రాతిశిల్ప గ్యాలరీ'లో వివిధ కాలాలకు చెందిన రాజులు సమకూర్చిన చల, అచల, చలాచల మూర్తులను కొలువుదీర్చారు. స్మూత్ సోప్‌స్టోన్, నల్ల, ఆకుపచ్చ గ్రానైట్, పాలరాయితో చెక్కిన శ్రీకృష్ణుడు, లక్ష్మీ నరసింహ స్వామి, భూవరాహస్వామి విగ్రహాలను సందర్శకులు ఇక్కడ చూడవచ్చు.కాంస్య విగ్రహాల గ్యాలరీ: పురాతన 'లాస్ట్-వాక్స్' పద్ధతిలో రూపొందించిన నటరాజు, సప్తమాతృకలు, శ్రీదేవి, భూదేవి, రాధాకృష్ణ, హయగ్రీవ లోహ విగ్రహాలను 'కాంస్య విగ్రహాల గ్యాలరీ'లో భద్రపరిచారు.ఆర్ట్ గ్యాలరీ: బాపు, కృష్ణారావు వంటి తదితర కళాకారులు గీసిన వర్ణచిత్రాలు, విరాట్ పురుషుడు, దశావతారాల చిత్రాలు, అలాగే తిరుమలకు సంబంధించిన అరుదైన ఫొటోలను 'ఆర్ట్ గ్యాలరీ'లో ప్రదర్శిస్తారు. అన్నమాచార్యులు రాగి రేకులపై రాసిన భక్తిగీతాలు, పురాతన నాణేలు కూడా ఇక్కడ ప్రదర్శనలో చూడొచ్చు.అంతస్తుకో వైవిధ్యం: ఇక మొదటి అంతస్తులో ఆలయ వాస్తు, శిల్పకళా వైభవాన్ని కళ్లకు కడుతుంది. సందర్శకులు ఇక్కడ వాస్తుశాస్త్ర రహస్యాలు, శ్రీవారి ఆలయంలోని వాకిళ్లు, కొలువు సింహాసనం, పాత హుండీ, 'పోటు' (ఆలయ వంటశాల)లో ఉపయోగించే పాత్రలను చూడవచ్చు. ఆనంద నిలయానికి అమర్చాలనుకున్న సుమారు 400 కిలోల బంగారు తాపడం ఆకట్టుకుంటుంది. ఇక్కడి ఆయుధ, సంగీత గ్యాలరీల్లో పురాతన సంప్రదాయ ఆయుధాలు, సంగీత వాయిద్యాలు, పూజ సామగ్రిని పేర్చారు.రెండో అంతస్తులో సృష్టి, స్థితి, లయకారులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల వైభవాన్ని భారీ తెరలపై ప్రదర్శిస్తారు. విష్ణుమూర్తి దశావతారాలు, వేదాలు, ప్రాచీన గ్రంథాల విశేషాలను వీక్షించవచ్చు. మ్యూజియానికి తలమానికంగా మూడో అంతస్తులో బ్రహ్మాండ గ్యాలరీని తీర్చిదిద్దారు. వీక్షకులను మంత్రముగ్ధులను చేసేలా సృష్టి రహస్యాలు, గ్రహాలు, అనంత కాలచక్రం, శ్రీవారి విశ్వరూపాన్ని 7డీ, ఇమ్మర్సివ్ టెక్నాలజీతో ఆవిష్కరిస్తారు. మ్యూజియం పైకప్పుపై 17 గోపురాల్లో అన్నమయ్య, తరిగొండ వెంగమాంబ, రామానుజాచార్యులు వంటి భక్తాగ్రేసరుల చరిత్రను, రామాయణ, మహాభారత ఘట్టాలను చెక్కారు.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్, కాలుష్యానికి చెక్!

**నగరానికి నలుదిక్కులా నాలుగు బస్ టెర్మినల్స్**

**హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుతోంది**

**దీన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని నగర శివార్లలో కొత్తగా బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది**

**దీంతో అంతర్రాష్ట్ర, జిల్లాల ప్రైవేట్ బస్సుల రద్దీని కట్టడి చేయనుంది.**

ఐటీ, భారీ పరిశ్రమలతో పాటు జీసీసీలు ఏర్పాటుకు సైతం హైదరాబాద్ అడ్డాగా నిలుస్తోంది. దీంతో పాటు ఇతర నగరాలతో పోలిస్తే తక్కువ ఖర్చుతోనే నివాసం ఉండటానికి ఆమోదయోగ్యమైన సిటీగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీని వల్ల రాష్ట్రంలోని జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల ప్రజలు సైతం భారీగా నగరానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుతోంది. ప్రభుత్వం దీన్ని దృష్టిలో ఉంచుకొని వాహన కాలుష్యాన్ని తగ్గించడం, ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాన్ని అందించేందుకు అవసరమైన ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు నగరం చుట్టూ నాలుగు ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది.హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో బస్సు టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని ఆయన వెల్లడించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రయాణీకులు వేచి ఉండేలా వెయిటింగ్ హాళ్లు, వాహనాలకు పార్కింగ్ సదుపాయాలు సహా ఆధునిక వసతులతో ఈ టెర్మినల్స్‌ను రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు. నగరాన్ని సుస్థిర ప్రజా రవాణా కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

**గాజులరామారం :**

ఇక్కడ బస్ టెర్మినల్‌ను ఏర్పాటు కోసం సుమారు 100 ఎకరాల భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది.

**శంషాబాద్ :**

రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రజారవాణాను మరింత మెరుగుపరిచేలా అక్కడికి వెళ్లే బస్సుల కోసం శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో 150 ఎకరాలను కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు తగిన అంశాలను పరిశీలిస్తోంది.

**ఎల్బీనగర్, ఘట్‌కేసర్ :**



ప్రయాణికుల రద్దీని తట్టుకునేలా ఎల్బీనగర్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లోనూ ప్రభుత్వం బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేయనుంది.

**లాస్ట్ మైల్ కనెక్టివిటీ**

హైదరాబాద్ శివారులో బస్ టెర్మినల్స్ వద్ద దిగే ప్రయాణికులు నగరంలోని వివిధ ప్రాంతాలకు సులభంగా చేరుకునేలా లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేస్తారు. ఇందులో భాగంగా సిటీ ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలుతో పాటు ఎంఎంటీఎస్ సేవలను సైతం పూర్తిగా అనుసంధానం చేయనున్నారు. నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి రానున్న రోజుల్లో 2,200 సరికొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. వీటి ద్వారా కొత్తగా ఏర్పాటు చేయనున్న టెర్మినల్స్‌ను నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాలతో సమన్వయం చేస్తూ సిటీ బస్సు సేవలు కల్పించనున్నారు.హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేట్ బస్సులను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం, రాత్రిపూట పెద్ద సంఖ్యలో రోడ్లపై తిరగడం వల్ల ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం రెండూ పెరుగుతున్నాయని మంత్రి పొన్నం పేర్కొన్నారు. దీనికి పరిష్కారంగా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాల నుంచి వచ్చే అంతర్రాష్ట్ర బస్సులతో పాటు ఇతర జిల్లాల నుంచి నగరానికి వచ్చే బస్సులను కూడా ఇకపై నగరంలోకి ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం యూజర్ ఛార్జీలను వసూలు చేస్తూ ప్రైవేట్ బస్సులను సైతం ఈ టెర్మినల్స్ నుంచే నడిపే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఈ విధానాన్ని అమలు చేస్తే నగరంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు.

# ఆపద వేళ అరక్షణంలో స్పందిస్తుంది

**తెలంగాణలో మరింత ఆధునిక టెక్నాలజీతో 'డయల్ 112'**

**దేశవ్యాప్తంగా ఒకే అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థ అవసరమని కేంద్ర ప్రభుత్వం డయల్ 112ను తీసుకొచ్చింది**

**ఈ నంబరుకు కాల్ చేస్తే చాలు బాధితుడి ఫోన్ లొకేషన్ ఆధారంగా సంబంధిత రాష్ట్రంలోని కాల్‌సెంటర్‌కు కాల్ చేరిపోతుంది.**




ప్రజల ఆపద్బాంధవుడిగా డయల్ 112 కీలక పాత్ర పోషిస్తోంది. గతంలో ఈ పాత్ర డయల్ 100 వ్యవస్థ చేసేది. దేశవ్యాప్తంగా ఒకే అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థ అవసరమని కేంద్ర ప్రభుత్వం డయల్ 112ను తీసుకొచ్చింది. దేశంలో ఏ మూల నుంచైనా ఈ నంబరుకు కాల్ చేస్తే చాలు బాధితుడి మొబైల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా సంబంధిత రాష్ట్రంలోని కాల్‌సెంటర్‌కు అది చేరిపోతుంది. కాల్ సెంటర్ సిబ్బంది వివరాలు తెలుసుకొని ఘటనాస్థలికి సమీపంలోని బ్లూకోల్ట్స్ సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేస్తారు. ఇది అన్ని రాష్ట్రాల్లో జరిగేదే అయినా తెలంగాణ పోలీసులు మరింత ముందడుగు వేసి ఇప్పుడు దీనికి మరిన్ని ఆధునిక హంగుల్ని జోడించారు.ఎవరైనా అత్యవసర సాయం కోసం డయల్ 100కు ఫోన్ చేస్తే అది నేరుగా కాల్ సెంటర్‌కు వెళ్తుంది. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్‌ఎస్) బటన్లను నొక్కిన అనంతరం అక్కడి కాల్‌టేకర్ విషయాన్ని తెలుసుకుంటారు. బాధితులు చెప్పే వివరాల్ని నమోదు చేసుకుని ఘటన జరిగిన ప్రాంతం పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందిస్తారు. వెంటనే ఆ పోలీస్ స్టేషన్‌లోని బ్లూకోల్ట్స్ సిబ్బంది బాధితుడి నంబరుకు కాల్ చేసి ఘటనాస్థలికి చేరుకుంటారు.ఆపద వేళ సాయం కోసం ఫోన్ చేసినప్పుడు ఓవైపు ఐవీఆర్‌ఎస్ ప్రక్రియ కొనసాగుతుండగానే ఒకవేళ బాధితుల వైపు నుంచి అరుపులు, గొడవలు వినిపిస్తే అర క్షణంలో ఈ వ్యవస్థ స్పందిస్తుంది. బాధితులు ఐవీఆర్‌ఎస్ బటన్లు నొక్కకపోయినా ఆ ప్రక్రియను దాటుకొని కాల్‌టేకర్‌ను వెంటనే అప్రమత్తం చేస్తుంది. ఘటనాస్థలి ఎక్కడుందో అత్యంత వేగంగా అనాలసిస్ చేసి వెంటనే అక్కడి బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తుంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు కొంపల్లిలో ఏర్పాటు చేసిన డయల్ 100 వ్యవస్థను కొంతకాలం క్రితం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)కి మార్చిన విషయం తెలిసిందే. ఇక్కడ రెండు అంతస్తుల్లో తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ (టీజీఈఆర్‌ఎస్‌ఎస్) కాల్‌సెంటర్‌ను మోడ్రన్ టెక్నాలజీతో తీర్చిదిద్దారు. కొంపల్లిలో కేవలం 18 డెస్క్‌లు ఉండగా టీజీఐసీసీసీలోకి మారిన తర్వాత అది ఏకంగా 50కి పెరిగింది.పోలీస్, ఫైర్, మెడికల్, చైల్డ్ సర్వీస్, మహిళా భద్రత, రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు సహాయం ఇలా అన్నింటికీ ఒకటే అత్యవసర నంబరును అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనికితోడు ఈ వ్యవస్థకు ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడంతో దేశంలోనే అత్యుత్తమ కాల్‌సెంటర్లలో ఒకటిగా ఉండేలా రూపొందించారు. అధునాతన డ్యాష్‌బోర్డులు, డేటా ఎనలిటిక్స్‌తో కూడిన టెక్నాలజీ మేళవించి ఉండటంతో ఒకేసారి 900లకుపైగా కాల్స్‌ను నిర్వహించగల కెపాసిటీ ఈ వ్యవస్థకు ఉంది.ఫోన్ కాల్ సంభాషణలో ఓవైపు ఐవీఆర్‌ఎస్ నడుస్తున్న సమయంలోనే కాలర్ స్వరంలో భయం, అరుపులు, ఏడుపులు లేదా వెనక వస్తున్న అల్లర్లు, గొడవల శబ్దాలను ఆటోమేటిగ్గా అనాలసిస్ చేస్తుంది. ఒకవేళ ప్రమాదకర పరిస్థితిలో ఉన్నవారు ఐవీఆర్ బటన్లు నొక్కకపోయినా, నేరుగా మాట్లాడటం ఆరంభించినా ఈ అధునాతన వ్యవస్థ ఐవీఆర్‌ను దాటుకొని (బైపాస్ చేసి) నేరుగా కాల్‌టేకర్‌కు అనుసంధానం చేస్తుంది. ఒకే నంబరు నుంచి వరుసగా ఎమర్జెన్సీ కాల్స్ వస్తుంటే ఆలస్యం చేయకుండా నేరుగా సిబ్బందికి కనెక్ట్ చేస్తుంది.కాలర్ 112కు డయల్ చేసి మాట్లాడే సందర్భంలో ప్రతి మాటను సిస్టమ్ రియల్ టైంలోనే అక్షర రూపంలోకి మారుస్తుంది. కాల్‌టేకర్‌తో బాధితుడు జరిపిన సంభాషణ ఆధారంగా అసలేం జరిగిందో సిస్టమ్ పూర్తిగా పరిస్థితిని అర్థం చేసుకుంటుంది. ఘటనకు సంబంధించిన క్లుప్తంగా అసలు సారాంశాన్ని రూపొందిస్తుంది.కాలర్ చెప్పే విషయాల ఆధారంగా సంఘటన ఏ రకానికి చెందినదో (ఉదాహరణకు యాక్సిడెంట్, ఘర్షణ, చోరీ) యాంత్రికంగానే విభజిస్తుంది.సంఘటన స్వభావాన్ని బట్టి ఏరకమైన సేవలు (పోలీస్/ఫైర్/అంబులెన్స్) అందించాలో సూచిస్తుంది.బాధితులు లేదా కాలర్లు తమ లొకేషన్‌ను సరిగ్గా చెప్పలేని క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా టెక్నాలజీ ఆధారంగా ఘటనాస్థలిని కచ్చితంగా గుర్తిస్తుంది.

## అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌లో రూ. 5,912 కోట్లు

**14 ప్రాజెక్టులకు సూత్రప్రాయ ఆమోదం**

**పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది**

**అర్బన్ ఛాలెంజ్ ఫండ్ రెండో విడతలో 5 వేల 912 కోట్ల అంచనా వ్యయంతో 14 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది.**



పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ రెండో విడతలో 5 వేల 912 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 14 ప్రాజెక్టులకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. పట్టణాల్లో మురుగునీటి వ్యవస్థ, వరదనీటి కాలువలు, తాగునీటి సరఫరా, పార్కింగ్, వాణిజ్య మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నారు.రాష్ట్రంలో పట్టణ మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ అమలు చేస్తున్న అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద రెండో దశలో చేపట్టనున్న 14 ప్రాజెక్టులకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. 14 ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయాన్ని 5 వేల 912 కోట్లుగా ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయంలో 25 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా అందించనుంది. మరో 50 శాతం నిధులను మున్సిపల్ బాండ్లు, పీపీపీ విధానం ద్వారా సమీకరించనున్నారు. మిగిలిన 25 శాతం నిధులను పట్టణ స్థానిక సంస్థలే సమకూర్చుకోవాల్సి ఉంటుంది.నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేలా : అమరావతి ఆర్థిక ప్రాంతం పరిధిలోని 25 పట్టణ స్థానిక సంస్థల్లో మురుగు, వరదనీటి కాలువల నిర్మాణానికి 18 వందల కోట్లు ప్రతిపాదించారు. తిరుపతి ఆర్థిక ప్రాంతంలోని 23 పట్టణ స్థానిక సంస్థల్లోనూ ఇదే తరహా పనులకు 12 వందల 31 కోట్లు, విశాఖ ఆర్థిక ప్రాంతంలోని 11 పట్టణ స్థానిక సంస్థల్లో డ్రైనేజీ, వరదనీటి నియంత్రణ పనులకు 867 కోట్ల 70 లక్షల రూపాయలు ప్రతిపాదించారు. విజయవాడలో వరదనీటి కాలువల నిర్మాణానికి 600 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. నగర శివారు ప్రాంతాల్లో నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేలా ఎస్.సీ.ఏ.డీ.ఏ వ్యవస్థ ఏర్పాటుకు 300 కోట్లు, తాడిగడపలో నీటి సరఫరా సమస్య పరిష్కారానికి 150 కోట్ల ప్రాజెక్టును ప్రతిపాదించారు.నెల్లూరులో పరిశ్రమలకు శుద్ధి చేసిన మురుగునీటిని అందించే ప్రాజెక్టుకు 200 కోట్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి 130 కోట్లు ప్రతిపాదించారు. రాజమహేంద్రవరంలో రెండు ప్రాంతాల్లో మల్టీలెవల్ కార్ పార్కింగ్, గోదావరి రివర్‌ఫ్రంట్, మల్టీ ఫంక్షనల్ కమర్షియల్ హబ్‌ను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు 240 కోట్లు ప్రతిపాదించారు. గుంటూరులో మురుగునీటి వ్యవస్థకు 300 కోట్లు, పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్‌ను పీపీపీ విధానంలో నిర్మించేందుకు 118 కోట్లు, ఇతర మౌలిక వసతుల కోసం 53 కోట్ల 65 లక్షలు కావాలని ప్రతిపాదించారు.అర్బన్ ఛాలెంజ్ ఫండ్ రెండో దశలో పట్టణ స్థానిక సంస్థలే తమ వాటా నిధులను సమకూర్చుకోవాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. అవసరమైన రుణాలను సమీకరించే బాధ్యతను కూడా స్థానిక సంస్థలే చేపట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ తొలి దశలో 19 వందల 90 కోట్ల 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో విశాఖ, తాడేపల్లి-మంగళగిరి నగరపాలక సంస్థల్లో 4 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. రెండో దశలో తాజాగా మరో 14 ప్రాజెక్టులకు ఆమోదం లభించడంతో రాష్ట్రంలోని పలు పట్టణాల్లో డ్రైనేజీ, వరద నియంత్రణ, నీటి సరఫరా, పట్టణ మౌలిక వసతులు మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

## వానపడినా, ట్రాఫిక్ అధికంగా ఉన్నా అధిక ఛార్జీలు

**ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్న డ్రైవర్లు**

**వాహనాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడంలో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి**

**వర్షం కురిసినా, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నా అదనపు ఛార్జీల పేరిట ప్రయాణికుల నుంచి వాహనదారులు వసూలు చేస్తున్నారు.**



గతంలో వాహనాలను బుక్ చేసుకునేందుకు నేరుగా డ్రైవర్లు, యజమానుల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. దీంతోపాటు అనేకమంది ప్రజారవాణా వ్యవస్థలపైనే ఎక్కువగా ఆధారపడేవారు. అనంతరం కాలంలో టెక్నాలజీ విరివిగా అందుబాటులో రావడంతో ఆన్‌లైన్ ద్వారా వాహనాలను బుకింగ్ చేసుకొనే అవకాశం కలిగింది. ప్రస్తుతం చాలా సులభంగా వాహనాలను యాప్ లేదా ఆన్‌లైన్‌లో సులభంగా బుకింగ్ చేయగలుగుతున్నారు. నగరాల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి ప్లాట్‌ఫాంలు విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. ఈ తరుణంలో అనేక కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. ఆన్‌లైన్‌లో వాహనం బుక్ చేసుకుంటే ప్రయాణం సులభం అవుతుందనుకుంటే అటు అగ్రిగేటర్ సంస్థలు, ఇటు డ్రైవర్లు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నారు. వర్షం పడినా, ట్రాఫిక్ పెరిగినా, పొద్దుపోయినా, చిన్నపాటి సమస్యలు తలెత్తినా ఛార్జీలు అమాంతం పెంచేస్తున్నారు. దీంతో అనేక మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో అధిక ధరలు చెల్లించే ప్రయాణాలు చేస్తున్నారు.యాప్ లేదా ఆన్‌లైన్ బుకింగ్ అనంతరం ముందుగా డ్రైవర్ ఫోన్ చేసి గమ్యస్థానాన్ని ధ్రువీకరణ చేసుకుంటున్నారు. దూరం తక్కువైతే రైడ్ తిరస్కరిస్తున్నారు. లేదంటే టిప్ ఇస్తామంటేనే బుకింగ్ తీసుకుంటున్నారు. మరి కొంతమంది యాప్‌లో అంగీకరించాక క్యాన్సిల్ చేస్తున్నారు. ఈ తరహా సమస్యలు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.గతంలో దగ్గర ప్రాంతాలకు వెళ్లేందుకు రోడ్డు మీద ఆటోలను విరివిగా వినియోగించేవారు. దూరప్రాంతాలకు వెళ్లాలనుకుంటే తెలిసిన కారు ట్రావెల్స్ సంస్థతో మాట్లాడుకొని వెళ్లే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం ఎక్కడికి వెళ్లాలన్నా, ఆన్‌లైన్ మార్గాన్నే ఎంచుకుంటున్నారు. ఒకే మార్గానికి ఒకే సమయంలో వేర్వేరు అగ్రిగేటర్ సంస్థలు నడుపుతున్నాయి. అయితే వాటి ఛార్జీల్లో మాత్రం భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. గరిష్ఠంగా ఎంతవరకు ఛార్జీ పెంచవచ్చు అన్న విషయంలో ఎలాంటి నియంత్రణ, నిబంధనలు లేకపోవడంతో అగ్రిగేటర్ సంస్థలు వారికి నచ్చిన రేట్లతో ఛార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు నష్టపోతున్నారు.అంతర్రాష్ట్ర ప్రయాణాల్లో యాప్‌తో కారు బుకింగ్ చేసుకుంటున్న వారి నుంచి డ్రైవర్లు రూ.2 నుంచి 3 వేలు అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్రాష్ట్ర పర్మిట్లు వారానికి, నెలకు, ఏడాదికి ఉంటాయి. ఒక ట్రిప్ బుకింగ్ చేసుకున్నవారి నుంచి సైతం వారం రోజుల పర్మిట్ ఫీజును వసూలు చేస్తున్నారు. అదనంగా టోల్ ఫీజును వసూలు చేస్తున్నారు.మిర్యాలగూడ నుంచి నార్కట్‌పల్లి మీదుగా రావాల్సిన వాహనాలను నల్గొండ నుంచి మునుగోడు మీదుగా మళ్లిస్తున్నారు. ఆ రూట్లో టోల్ ఉండదు. అయినా ఛార్జీలు భారాన్ని భరించాల్సి రావడంతోపాటు దూరం, ప్రయాణ సమయం పెరుగుతోంది. ప్రయాణికులు అడిగితే యాప్ ఇలాగే చూపిస్తోందంటూ మాయమాటలు చెబుతున్నారు. పండగలు, సెలవులు, రద్దీ సమయాల్లో కొన్ని ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్నాయి. అదనంగా 50 నుంచి 100 శాతం వరకు ఛార్జీలు వసూలు చేస్తున్నాయి.పర్మిట్లు, రిజిస్ట్రేషన్లు, రోడ్‌సేఫ్టీ సెస్, వివిధ రకాల ఫీజులు, చలాన్ల రూపంలో వాహనదారుల నుంచి ప్రతి సంవత్సరం రవాణాశాఖ రూ.వేల కోట్ల ఆదాయం గడిస్తోంది. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం విషయంలో వారి ఆర్థిక ప్రయోజనాలు, భద్రత అంశాలు తనకు పట్టనట్లు వ్యవహరిస్తోంది. రవాణాశాఖ కొత్తగా రూపొందిస్తున్న అగ్రిగేటర్ పాలసీలోనూ ఆదాయాన్ని పెంచుకునే సంస్కరణలకే ప్రాధాన్యం ఇస్తోంది. యాప్‌తో బుకింగ్ ద్వారా ప్రయాణం చేసే కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు, ప్రైవేటు బస్సుల ఛార్జీల విషయంలో నియంత్రణ తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com